అమ్మ మాట - అంగన్‌వాడీ బాట ర్యాలీ



ఘనాపూర్ అంగన్‌వాడీ ర్యాలీలో మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం 6 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలకు ఉచిత విద్యతో పాటు భోజనం వడ్డిస్తోందని, పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు.

అన్నదానం



కీసర: కీసర గోధుమకుంట పరిధిలోని ఓమౌ జయ శ్రీభవతి క్షేత్రంలో పౌర్ణిమ సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పరమోజీ, శ్రీభవతి క్షేత్రం పాలక మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సీపీ



కేపాల్ చెక్‌పోస్ట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీపీ సుధీర్‌బాబు

ఘట్‌కేసర్: కేపాల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్, పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్రైం రేటు తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్సైలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ ఒలీవ్ హోటల్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి(40–45 సంవత్సరాలు)కి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఆరా తీసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

దళితుల భూములను ల్యాండ్ పూలింగ్‌కు తీసుకోవాలి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని సర్వే నంబర్–63/2 నుంచి 63/25లో 336 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ పనులు చేపట్టాలని కోరుతూ బుధవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో దళితులు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే దళిత రైతులకు ఎకరానికి 600 గజాల చొప్పున కేటాయించాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ల్యాండ్ పూలింగ్ చేపట్టారని, కోర్టు కేసు వల్ల పెండింగ్ పడిందన్నారు. కేసును వెకెట్ చేయించి ల్యాండ్ పూలింగ్ పనులు చేపట్టాలన్నారు. అందుకు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మీసాల కృష్ణ, కామగల్ల నర్సింహ, చిన్నింగల్ల కుమార్, ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉప్పరి విజయ్ తదితరులున్నారు.

ఆటలకు టాటా.. బడిబాట

నిన్నా మొన్నటి వరకు ఉత్సాహంగా ఆడిపాడిన విద్యార్థులు.. ఇక ఆటలకు టాటా చెప్పేసి.. బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. వేసవి సెలవుల్లో పక్కన పెట్టిన బ్యాగులను రెడీ చేసుకుంటున్నారు. పాత కొత్త విద్యార్థులకు స్కూళ్లు స్వాగతం పలుకుతున్నాయి.
– మేడ్చల్



ముస్తాబవుతున్న పూడూర్ పాఠశాల

- నేడు ప్రారంభం కానున్న పాఠశాలలు
- స్వాగతం పలకడానికి ముస్తాబు
- విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు

మేడ్చల్ ఉమ్మడి మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల కలిపి 177 ఉండగా అందులో 28,842 మంది విద్యార్థులు ఉన్నారు. 13 జిల్లా పరిషత్ పాఠశాలలు, 33 ప్రభుత్వ ప్రైమరి పాఠశాలలు ఉండగా వాటిల్లో 6,842 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 77 ప్రైవేటు స్కూళ్లలో 22వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటుపై ఆసక్తి చూపడంతో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు అధికంగా ఉన్నారు.

ఆ గ్రామాల్లోని స్కూళ్ల మూత

మండలంలోని మైసమ్మగూడ, షహజదిగూడ, బర్మాజీగూడ, గూడెంగడ్డ తండాలలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులు లేకపోవడంతో జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంతో నాలుగు గ్రామాల స్కూళ్లను గతంలోనే మూసేశారు. ఈ నాలుగు గ్రామాల్లో పేదలు అధికంగా నివాసం ఉంటున్నారు. అయినా అధికారులు విద్యార్థులను స్కూళ్లకు తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించకపోవడంతో అవి మూతపడ్డాయి.



మేడ్చల్‌లోని ప్రభుత్వ పాఠశాల

భవనం లేని జ్ఞానాపూర్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జ్ఞానాపూర్ 42 మంది విద్యార్థులు ప్రభుత్వ బడికి వచ్చి చదువుకుంటున్నా అక్కడ పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో పాఠశాల కొనసాగుతోంది. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణం చేపడతామని అంటున్నా స్థలం సమస్య ఏర్పడింది.

టీచర్లు ఫుల్..

మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు పూర్తిస్థాయిలో ఉన్నారు. రిటైర్ అయిన టీచర్ల పోస్టులు మినహా మండలంలో అన్ని గ్రామాల పాఠశాలలో టీచర్లు పూర్తిస్థాయిలో ఉన్నారు. 170 మంది టీచర్లు ప్రస్తుతం పని చేస్తున్నారు.

అందరికీ శిక్షణ

ప్రభుత్వ పాఠశాలలో బోధనతో పాటు పిల్లలకు అన్ని వసతులు ఉండాలని ప్రభుత్వం ఈ సంవత్సరం అందరికీ శిక్షణ ఇచ్చింది. హైస్కూల్, ప్రైమరి స్కూల్ టీచర్లతో పాటు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వాష్‌రూంలను శుభ్రం చేసే స్కావెంజర్లకు, మధ్యాహ్న భోజనం తయారు చేసే వారికి శిక్షణ ప్రారంభించారు.

పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

పాఠశాలలు ప్రారంభించకముందే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టడంతో అందుబాటులో ఉంచారు. పార్ట్–1 పాఠ్యపుస్తకాలు ఇప్పటికే పాఠశాలలకు చేరాయి. పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేసేందుకు అంతా సిద్ధం చేశారు. విద్యార్థులకు ఒక్కో జత యూనిఫామ్స్ అందజేయనున్నారు. మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలలకు బియ్యం తరలిస్తున్నారు.

పిల్లలకు ఘనంగా స్వాగతం పలుకుతాం



నూతన విద్యా సంవత్సరంలోకి వెళ్తున్న విద్యార్థులతో పాటు మొదటిసారి స్కూళ్లకు వచ్చేస్తున్న విద్యార్థులకు స్వాగతం పలకడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు అన్ని రకాల వసతులు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అడ్మిషన్లు తీసుకోని వారు వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలి.
– ఎంఈఓ శంకరయ్య

స్పందించి.. చెత్త తొలగించి..

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ లోపాన్ని గుర్తుచేస్తూ బుధవారం సాక్షిలో ప్రచురితమైన రోడ్డు పక్కనే చెత్త.. ఇలా చేస్తే ఎట్లా..? అనే కథనానికి మేడ్చల్ మున్సిపల్ శానిటరీ అధికారులు స్పందించారు. కిష్టాపూర్ రోడ్డులో వాగు వద్ద రోడ్డు పక్కన ఇష్టానుసారంగా పడేసిన చెత్త కుప్పలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. దుకాణదారులు తమ వ్యర్థాలను మరోమారు వేయకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. సాక్షి కథనాన్ని చదివిన మున్సిపాలిటీకి చెందిన పాతకులు తమ కాలనీల్లోకి చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని సాక్షితో విన్నవించుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది మున్సిపాలిటీని అన్ని కాలనీల్లో నిత్యం చెత్త సేకరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భూసమస్యలను పరిష్కరించుకోండి

ఘట్‌కేసర్: భూభారతి సదస్సులో తమ భూసమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రజిని అన్నారు. మర్పల్లిగూడలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సులో మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, భూయజమానుల రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. రికార్డులో మార్పులు, విస్తీర్ణం, ముద్రణలో తప్పులు దొర్లితే సరిచేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, మల్లేశ్, ఆంజనేయులు, నాగరాజుముదిరాజ్, నరేశ్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



మర్పల్లిగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజిని, మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య

చెత్త కంపోస్టింగ్‌పై అవగాహన



చెత్త కంపోస్టింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కమిషనర్ నాగమణి

కీసర: రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని దమ్మాయిగూడలో ఏబీసీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలించడం, తడి, పొడి చెత్త కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కీసర: కీసర పరిధిలోని బర్సిగూడ, వన్నిగూడ, కీసర దాయరలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న బడిబాట కార్యక్రమానికి బుధవారం ఎంఈవో జమదగ్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, ముత్యం స్వామి, గోపాలకృష్ణ, జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కీసరలో బడిబాట కార్యక్రమంలో ఎంఈవో జమదగ్ని, ఉపాధ్యాయులు

కుందన్‌పల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



కీసర: కుందన్‌పల్లిలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్ డాక్టర్ సందీప్, ఎస్.విక్రమ్, నిహారిక, ఏఈవో వందన, రాజ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలకు అనుగుణంగా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో నీటి ప్రాముఖ్యత, నీటిని ఒడిసిపట్టుకునే విధానాలు, వాలుకి అడ్డంగా దుక్కు దున్నడం వల్ల కలుగు లాభాలను వివరించారు. అవసరమైన క్రిమి సంహారక మందులు వాడాలని, ఆ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ

శామీర్‌పేట్: రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టనున్న భూ సేకరణపై బుధవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, భూ సేకరణ అదనపు కలెక్టర్ మాలతి పాల్గొని ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సమావేశంలో ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుతం రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరం మేరకే భూ సేకరణ చేపట్టాలని కోరారు. రాజీవ్ రహదారిని 100 ఫీట్లకే విస్తరించాలన్నారు. ఈ భూ సేకరణతో వందల కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. భూములు కోల్పోయే బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం సమాన భూమిని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్లకార్డులతో నిరసన తెలిపి రాజీవ్ రహదారిపై ఆందోళనకు దిగాగారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఎస్‌ఎన్‌డీపీ పనులు పున:ప్రారంభం



పీర్జాదిగూడలో ఎస్‌ఎన్‌డీపీ పనులను పున: ప్రారంభోత్సవంలో మాజీ మేయర్ అమర్ సింగ్

బోడుప్పల్: గతంలో ఆగిపోయిన ఎస్‌ఎన్‌డీపీ పనులు పున: ప్రారంభమైనట్లు పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ వెల్లడించారు. పీర్జాదిగూడలో బుధవారం రెండో దఫా ఎస్‌ఎన్‌డీపీ పనులు ప్రారంభం కాగా కమిషనర్ త్రిలేశ్వర్ రావుతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ చొరవతో మరలా నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలంటూ ధర్నా

బోడుప్పల్: పెంచిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నగర కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు బస్‌పాస్ చార్జీలను పెంచిందన్నారు. బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి ఉపేందర్, మహేందర్, షోయబ్, విష్ణువర్ధన్, కౌశిక్, దత్తు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఆర్మీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ(భువనగిరి) మహిళా కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీలత తెలిపారు. కళాశాలలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 23లోపు ప్రవేశాలు స్వీకరిస్తామని 2025లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు, జనవరి 1, 2025 తర్వాత జారీచేసిన ఆదాయ ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు(5) ఫొటోలు సమర్పించాలన్నారు. కళాశాలో ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్‌సీ, బీజెడ్‌సీ, బీఏ, బీకామ్(బాలికలు), బీకామ్(సీఏ) గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, యూపీఎస్‌సీ శిక్షణ అందుబాటులో ఉందన్నారు. అదనపు సమచారం కోసం ఫోన్: 79950 10687, 79811 99283 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు ఇచ్చే వరకు పోరాడతాం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందే వరకు తమ పోరాటం ఆగదని కౌకుంట్ల చంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పోరాటంలో న్యాయమే గెలిచిందన్నారు. మున్సిపల్ పరిధిలో 6200కు పైగా ఇళ్లను నిర్మించారన్నారు. అందులో స్థానికులకు 10 శాతం ఇవ్వాలని గతంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకొచ్చామన్నారు. నాగారం పరిధిలోని పేదలకు ఇళ్లు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, వీరేష్‌గౌడ్, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

భార్యకు వైద్యం చేయించలేకపోతున్నాననే మనస్తాపంతో..

అల్వాల్: భార్యకు వైద్యం చేయించలేకపోతున్నానని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిజన బస్తీలో నివసించే మంచాల సత్యనారాయణ(68), అమృతలక్ష్మీ భార్యభర్తలు, వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సత్యనారాయణ ఆర్టీసీలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందారు. వృద్ధాప్య సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు అధికమయ్యాయి. ఈ క్రమంలో భార్యకు వైద్యం చేయించడానికి డబ్బులు లేవన్న మనస్థాపంతో బుధవారం ఉదయం ఇంట్లో వెంటిలేటర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరుగురు సంతానం ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు వైద్యం అందించడం పట్ల ఇబ్బందులు ఏర్పడటంపై స్థానికులు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



లాలి(ఫైల్)

జవహర్‌నగర్: తరచూ ఫోన్ వాడొద్దని తల్లి మందలించడంతో కూతురు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మిగడ్డ జైజవాన్ కాలనీలో నివసించే కేశవ్, భార్య చంద్ర, చిన్న కుమార్తె లాలి(20) కలిసి ఉంటున్నారు. ఈ నెల 11వ తేదీన లాలి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా లభించలేదు. కాగా లాలిని తరచూ ఫోన్ వాడొవద్దని తల్లి మందలించడంతోనే ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉండవచ్చని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పితే అంతే..!

మేడ్చల్: మేడ్చల్–కిష్టాపూర్ రోడ్డులో కేఎల్‌ఆర్ కమాన్ వద్ద ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా ఆస్పత్రి పాలవ్వాల్సిందే.. కమాన్ వద్ద నుంచి వాగు వరకు మురుగు కాల్వ ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు రోడ్డు పక్క నుంచి ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి. మురుగు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రోడ్డు అంచులను పూర్తిగా కోసేసింది. దీంతో లోతైన గుంతలు ఏర్పడి అందులో నుంచి మురుగు పారుతోంది. రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 200 మీటర్ల మేర రోడ్డు కోతకు గురై రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు రద్దీ సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మేడ్చల్–కిష్టాపూర్ రోడ్డు పక్కన మురుగు కాల్వ



ఎన్ఎస్ఎస్ ఆరంభ్‌లో పాల్గొన్న నిర్వాహకులు

ముగిసిన ఆరంభ్

పోచారం: యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహిస్తున్న ×ఆరంభ్–2025₹మెగా వైద్య శిబిరం బుధవారం ముగిసింది. ఈ శిబిరంలో కంటి, దంత, శారీరక పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.శోభారాణి హాజరై మాట్లాడారు. వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రీతి జీవన్ తదితరులు పాల్గొన్నారు.